నిబంధనలు మీరుతున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యం, పార్కింగ్, ఆటస్థలాలు, ఫైర్ సేఫ్టీ పరికరాలు లేకుండా అనుమతులు మంజూరు చేసిన విద్యాశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ పట్టణ కన్వీనర్ బి.యశ్వంత్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో స్థానిక అశ్వారావుపేట రోడ్డులోని శ్రీరామచంద్ర ఇంగ్లీష్ మీడియం స్కూల్లో నిబంధనలకు విరుద్ధంగా బస్సులు నిలుపుదల చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మాట్లాడుతూ ప్రధాన రహదారిపై బస్సులు నిలిపి విద్యార్థులను వాహనాలు ఎక్కించడం, దింపడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ సర్వేశ్వరరావుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు మణి, రాజేష్ పాల్గొన్నారు.

గోదావరి వరద తగ్గుముఖం

ముంపులోనే పలు రహదారులు
15 రోజులుగా 16 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
వసతుల్లేక పునరావాస కాలనీ ప్రజల అవస్థలు
భోజనం, తాగునీరు కూడా లేని దుస్థితి

ప్రజాశక్తి - కుక్కునూరు

వారం రోజులుగా ముంపు మండలాల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేసిన గోదావరికి వరద ఉధృతి సోమవారం తగ్గుముఖం పట్టింది. భద్రాచలంలో 56 అడుగులకు చేరిన గోదావరి నీటి మట్టం సోమవారానికి 41 అడుగులకు తగ్గడంతో ముంపు మండలాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. వరదల కారణంగా వేలేరు-బూర్గంపాడు, చీరవల్లి-వింజరం మధ్య ప్రధాన రహదారిపై వరద నీరు చేరి ఐదు రోజులుగా నిలిచిన రాకపోకలు ప్రస్తుతం యథావిధిగా సాగుతున్నాయి. అలాగే సీతారామనగరం-శ్రీధర మధ్య రహదారిపై వరద తగ్గి రాకపోకలు సాగుతున్నాయి. 15 రోజులుగా ముత్యాలంపాడు-వింజరం మధ్య గల పాలవాగు కాజ్‌వే, కుకునూరు-దాచారం మధ్య గుండేటి వాగుపై కాజ్‌వే ముంపులోనే ఉండటంతో16 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వీరంతా మండల కేంద్రానికి రావాలంటే 15 కిలోమీటర్ల మేర చుట్టూ తిరిగి రావాల్సిన పరిస్థితి నెలకొంది. గొమ్ముగూడెం, కుక్కునూరులోని గణేష్ నగర్, రామాలయం కాలనీ, రజక బజారు, దాసరి బజార్ కాలనీల్లోని ఇళ్లల్లోకి చేరిన వరదనీరు తగ్గడంతో ముంపు నుండి బయటపడ్డాయి. ఇళ్లల్లో అడుగు మందం ఒండ్రు పేరుకుపోయి చెత్తాచెదారంతో నిండి దుర్గంధం వెదజల్లుతున్నాయి. మళ్లీ గోదావరి వచ్చే ప్రమాదం ఉండటం ఆగస్టు చివరి వరకూ వరద గండం పొంచి ఉండటంతో పునరావాస కేంద్రాలకు వెళ్లిన వారు ఇప్పట్లో వచ్చే పరిస్థితి లేదు. గొమ్ముగూడెం గ్రామానికి చెందిన 253 కుటుంబాలు, బెస్తగూడెం గ్రామానికి చెందిన 150 కుటుంబాలు, రేపాకగొమ్ము గ్రామానికి చెందిన 203 కుటుంబాలు తలదాచుకున్న రావికుంట, కుక్కునూరు 'ఎ' బ్లాక్‌కు చెందిన 500 కుటుంబాలు తలదాచుకున్న కివ్వాక పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వరద బాధితులకు పని లేకపోవడం, ఓ వైపు వర్షాలు కురుస్తుండటంతో ఉన్న డబ్బులు అయిపోవడంతో ఆ నిరుపేద కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న తమకు తిండైనా పెట్టించి లేదా పనైనా చూపాలని వేడుకుంటున్నారు.

కుక్కునూరు మండలంలోని రామాలయం రోడ్డు వద్ద తగ్గిన వరద

12.97 లక్షల క్యూసెక్కుల గోదావరి జలాలు విడుదల

పోలవరం : పోలవరం వద్ద గోదావరి ఉధృతి తగ్గుముఖం పట్టింది. పోలవరం ప్రాజెక్టులోకి వస్తున్న12,97,350 లక్షల క్యూసెక్కుల అదనపు వరద జలాలను విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఇఇ పి.వెంకటరమణ తెలిపారు. పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 33.540 మీటర్ల నీటిమట్టం, దిగువన 25.250 మీటర్లు, ఎగువ కాఫర్ డ్యామ్ వద్ద 35.480 మీటర్లు, దిగువన 24.700 మీటర్లు నమోదైంది. పోలవరం వద్ద గోదావరి నీటి మట్టం 24.278 మీటర్లుగా ఉంది.

మూడు రోజులే భోజనంపెట్టారు

ఎం.వెంకమ్మ, వరద బాధితురాలు, గొమ్ముగూడెం

మా గ్రామం వరద ముంపునకు గురవుతుందని పది రోజుల క్రితం అధికారులు రావికుంట కాలనీకి తరలించారు. మూడు రోజులు అన్నం పెట్టారు. తరువాత పెట్టడం లేదు. పనులేక ఇబ్బంది పడుతున్నాం. భోజన వసతి కల్పిస్తే బాగుంటుంది.

గతేడాది ఇంటి నష్టం ఇప్పటికీ ఇవ్వలేదు

ముత్యం కృష్ణవేణి, రేపాకగొమ్ము

గతేడాది మా గ్రామం పూర్తిగా మునిగి ఇల్లు పడిపోయింది. రెండు నెలలు కట్టుబట్టలతో పునరావాస కేంద్రంలో అనేక ఇబ్బందులు పడ్డాం. ఏడాది గడిచినా ఇంటి నష్టం రాలేదు. ప్రస్తుతం మళ్లీ వచ్చిన వరదలకు ఇక్కడ తలదాచుకుంటున్నాం. ఈ బాధలు ఇంకా ఎన్ని సంవత్సరాలు పడాలి. ప్రభుత్వం స్పందించి మాకు న్యాయం చేయాలి.

పోలవరం వద్ద గోదావరి ఉధృతి

ఆందోళన చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

సమస్యలు పరిష్కరించాలని మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మధ్యాహ్న భోజన పథకం కార్మికుల పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్‌డిఒ కిషోర్‌కు వినతిపత్రం అందించారు. ఈ ధర్నానుద్దేశించి మధ్యాహ్న భోజన కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగమణి మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్న కార్మికులు ఏలూరు జిల్లాలో మూడు వేల మంది కార్మికులు పనిచేస్తున్నారని, జగనన్న గోరుముద్ద పేరుతో ఇస్తున్న మెనూఛార్జీలకు సంబంధం లేకుండా రోజుకో ఐటెంతో ప్రభుత్వం మెనూ తయారు చేసి వర్కర్లపై భారాన్ని మోపిందన్నారు. నూతన విద్యావిధానం వల్ల వర్కర్లు ఉపాధి కోల్పోతున్నారని, ఒకపక్క పనిభారం, మరోపక్క ధరల భారంతో, పెరగని మెనూ ఛార్జీలతో కార్మికులు పథకం నిర్వహించడం కష్టంగా మారిందన్నారు. రాగిజావ తయారు చేయటానికి గ్యాస్, వంట పాత్రలు అవసరం ఎంతైనా ఉందని, వీటిని ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాగిజావ తయారు చేయడానికి వంట కార్మికులు ఉదయం ఏడు గంటల నుండి పనిచేయాల్సిన పరిస్థితులున్నాయని, ధరలు పెరగడంతో వర్కర్లపైనే భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం తీపి పొంగలి చేయమన్నారని మెనూలో లేనివి పెట్టడానికి వర్కర్లపై ఆర్థిక భారం పడుతుందన్నారు. జగనన్న గోరుముద్ద తినని పిల్లలకు గుడ్డు, చిక్కీ ఇవ్వాలంటున్నారని, గుడ్డు ఉడకబెట్టడానికి అయ్యే గ్యాస్ ఖర్చు అదనంగా వర్కర్లపైనే భారం పడుతుందన్నారు. పనిలో అగ్ని ప్రమాదాలకు గురయ్యే అవకాశాలున్నా ఎలాంటి వైద్య బీమా సౌకర్యం లేదని, అనేక కేంద్రాల్లో ప్రథమ చికిత్స కూడా అందుబాటులో ఉండటం లేదన్నారు. కొన్ని పాఠశాలల్లో వంట షెడ్లు, వంట పాత్రలు, తాగునీరు సరఫరా అంటే ప్రభుత్వం కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థికి రూ.5.88, అప్పర్ ప్రైమరీ హై స్కూల్ విద్యార్థికి రూ.8.57తో నాణ్యమైన భోజనం పెట్టడం ఎలా సాధ్యమో ప్రభుత్వం ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు మాట్లాడుతూ కార్మికులపై రాజకీయ వేధింపులు పెరిగాయని, వీటిని అరికట్టాలని కోరారు. గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చేయాలని, రాగిజావ తయారీకి వంట పాత్రలు, గ్యాస్ స్టవ్, గ్యాస్ ప్రభుత్వమే ఇవ్వాలనీ, మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలనీ కోరారు. కనీస వేతనం ఇవ్వాలని, ప్రతీనెల ఐదో తేదీన వేతనం, బిల్లులు ఇవ్వాలనీ , గుర్తింపు కార్డులు, యూనిఫారాలు ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజన కార్మికుల జిల్లా అధ్యక్షులు వై.చంద్రకళ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు విజయలక్ష్మి, టి.స్వర్ణకుమారి, కె.విజయ, ఎం.నాగమణి, రమాదేవి, భవాని, రత్నకుమారి పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికే పాదయాత్ర : సిపిఎం

ప్రజాశక్తి - కలిదిండి

పాదయాత్రలో మాట్లాడుతున్న ఎ.రవి

అత్యధిక తలసరి ఆదాయం కలిగి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కోట్లాది రూపాయాల ఆదాయాన్ని సమకూరుస్తున్న కలిదిండి మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం విస్మరించడం శోచనీయమని సిపిఎం నేతలు పేర్కొన్నారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ప్రజాసమస్యల పరిష్కారానికి పెదలంక నుండి కలిదిండి వరకూ పాదయాత్ర సోమవారం సాగింది. ఈ పాదయాత్రను సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి జెండా ఊపి ప్రారంభించారు. పాదయాత్రకు గ్రామ గ్రామాన ఆటో, బిల్డింగ్ వర్కర్స్, సిఐటియు, టిడిపి, మహాసేన, బేడ, బుడగ జంగం నాయకులు ఘనస్వాగతం పలుకుతూ తమ సంఘీభావాన్ని తెలిపారు. పెదలంక, మూలలంక, భాస్కరరావు పేట, సంతోషపురం, గుర్వాయిపాలెం, కలిదిండి గ్రామాల్లో జరిగిన బహిరంగ సభల్లో రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, డిఎన్‌విడి.ప్రసాద్, మండల కార్యదర్శి ఎస్.మహంకాళీరావు మాట్లాడారు. అత్యధిక తలసరి ఆదాయం కలిగిన మండలంగా, 90 శాతం ఆక్వా సాగుతో ఉండి, సెజ్ రూపంలో, విదేశీ మారక ద్రవ్యం రూపంలోనూ వందల కోట్ల రూపాయలు ప్రభుత్వాలకు వస్తుందన్నారు. కానీ మండల ప్రజలకు సరైన తాగునీరు అందించడం గానీ, గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేయకపోవడం శోచనీయమన్నారు. పలుగ్రామాల్లో ఇరిగేషన్ భూముల్లో ఇంటి పన్ను, విద్యుత్, కుళాయి ఛార్జీలు చెల్లిస్తూ తరతరాలుగా వెయ్యి కుటుంబాలకుపైగా నివాసముంటున్న వారికి నేటికీ పట్టాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు స్థానిక ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఇచ్చిన హామీని తుంగలో తొక్కారన్నారు. ఆక్వా జోన్‌గా ప్రకటించారే గానీ, సరైన తాగునీరు అందించడంలో విఫలమయ్యారన్నారు. ఈ జోన్ పరిధిలో ప్రజలు అత్యధికంగా కేన్సర్, కిడ్నీ వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. శుద్ధి చేసిన తాగునీరు అందించాలని, అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని, జగనన్న కాలనీల్లో ప్రభుత్వమే ఇళ్లు కట్టివ్వాలని, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలనే పలు డిమాండ్లతో వినతి పత్రాన్ని తహశీల్దార్ వంశీకి అందజేశారు. సిపిఎం మండల కమిటీ సభ్యులు వీరవల్లి భాస్కరరావు, అద్దాని వెంకటేశ్వరరావు, చిప్పాడ దుర్గాప్రసాద్ దొర, జక్కుల మహేష్, చిన్నం శ్రీకాంత్, వెంకమ్మ, బుస్సా శివలీల, వీరవల్లి వరలక్ష్మి, ఎస్.మహాలక్ష్మి, టిడిపి బిసి సెల్ రాష్ట్ర కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస చక్రవర్తి, మహాసేన నియోజక వర్గ అధ్యక్షులు చాబత్తిన రాజు, బెడ బుడగ జంగాల సంఘం రాష్ట్ర కోశాధికారి బైలపాటి నాగ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

వరదకు రోడ్డు ధ్వంసం

కోమటిలంక - కైకలూరు మధ్య నిలిచిన రాకపోకలు
కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ పరిశీలన
ప్రత్యేక బోటు ఏర్పాటు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

బుడమేరు, రామిలేరు నుంచి వరద నీరు వచ్చి కోమటిలంక ఆటపాక మధ్య మట్టిరోడ్డు కొట్టుకుపోయిన ప్రాంతాన్ని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సోమవారం పరిశీలించారు. కోమటిలంక నుంచి కైకలూరు ప్రయాణానికి ఆటంకం లేకుండా తాత్కాలికంగా ఎస్‌డిఆర్ఎఫ్ బృందం ద్వారా ప్రత్యేకమైన బోటు సౌకర్యం కల్పించామని చెప్పారు. ఈ ఏర్పాట్లను అధికారులతో కలిసి ఆయన పరిశీలించి అప్రమత్తతో వ్యవహరించాలని ఆదేశించారు. వరద ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల కొల్లేరు అభయారణ్యం పరిధిలోని కోమటిలంక, ఆటపాక మధ్య మట్టిరోడ్డు కొట్టుకుపోయిందన్నారు. అయితే కోమటిలంకలో 450 కుటుంబాలున్నాయని, వారు ఆటపాకకు విద్య, ఇతర కార్యకలాపాల కోసం వెళ్లేందుకు వీలుగా ప్రత్యేకమైన బోటు సౌకర్యం కల్పించామని తెలిపారు. గోదావరి వరదల వల్ల పెద్దబోటు అక్కడ ఉందని వరద ఉధృతితగ్గిన వెంటనే ఆ బోటును ఇక్కడకు తీసుకొస్తామన్నారు. వరద ఉధృతి తగ్గిన తర్వాత ఈ ప్రాంతంలో కల్వర్టు గానీ, పైపులైన్లు వేయడం ద్వారా గానీ తిరిగి రోడ్డు సౌకర్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటి వరకు గ్రామస్తులు సహకరించాలన్నారు. ప్రయివేటు పడవలు ద్వారా రక్షణ చర్యలు లేకుండా ప్రజలను తరలించడం ప్రమాదకరమన్నారు. ఇక్కడ ఏర్పాటు చేసిన రెస్క్యూ బృందం సహకారంతో మాత్రమే ప్రయాణం చేయాలన్నారు. ఇందుకు గ్రామ సర్పంచి, గ్రామప్రజలు తమ సహకారం అందిస్తామని తెలిపారన్నారు. ఈ ప్రాంతంలో విఆర్‌ఒ, ఆర్ఐ పర్యవేక్షించి ఎప్పటికప్పుడు సమాచారాన్ని స్థానిక సర్పంచి, ఇతర అధికారులకు తెలపాలని ఆదేశించారు.

3న మన్యం రాష్ట్ర బంద్ జయప్రదానికి పిలుపు

వేలేరుపాడు: మణిపూర్‌లో ఆదివాసీలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు ఆదివాసీ మహిళలను నగ్నంగా రోడ్డుపై ఊరేగించడాన్ని నిరసిస్తూ ఈనెల మూడో తేదీన మన్యం రాష్ట్ర బంద్‌ను విజయంతం చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి ధర్మాల రమేష్ ఓ ప్రకటనలో కోరారు. మణిపూర్‌లో కుక్కీ, నాగ తెగల ఆదివాసీలకు, వారి ఆస్తులకు రక్షణ కల్పించాలన్నారు.పార్లమెంట్‌లో ఆమోదించిన అటవీ పర్యావరణ సవరణ చట్టం రద్దు చేయాలని, రాష్ట్రంలో రద్దు చేసిన జిఒ 3కు చట్టబద్ధత కల్పించాలని కోరారు. వరద భయంతో ఎటూవెళ్లే దారిలేక గుట్టలపై గుడారాలు వేసుకుని ఉంటున్న పోలవరం వరద బాధితులకు పునరవాస కేంద్రాలను ఏర్పాటు చేయాలని, తక్షణ సహాయ, సహకారాలు అందించాలని, నిర్వాసితులకు శాశ్వత పునరావాసం కల్పించాలని, నాన్ షెడ్యూల్ ఆదివాసీ గ్రామాలను షెడ్యూల్ ఏరియాలో కలపాలని డిమాండ్ చేస్తూ ఈ బందు జరుగుతుందని, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజాసంఘాల నాయకులు, ఆదివాసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

31 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఏలూరు: విద్య ద్వారా సమాజంలో ఉన్నతమైన శిఖరాలకు చేరుకోవచ్చుని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఓపెన్ స్కూల్ అడ్మిషన్లపై సోమవారం సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించే ఓపెన్ స్కూల్లో ప్రవేశాలపై అవగాహన కలిగించే పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరంలో పాఠశాలలు, కళాశాలల్లోచేరి చదువుకోవడానికి వీలుకాని ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రమే ఓపెన్ స్కూల్ విద్యకు ప్రోత్సహించాలన్నారు. 2023-24 విద్యా సంవత్సరానికి పదో తరగతి, ఇంటర్ కోర్సులకు జూలై 27వ తేదీ నుండి అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఓపెన్ స్కూల్లో చేరే వారు www.apopenschool.ap.gov.in వెబ్ సైట్ ద్వారా అన్ లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

ముంపు బాధితులకు ఇబ్బందుల్లేకుండా చర్యలు : జెసి

ప్రజాశక్తి - ఏలూరు

కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద ముంపునకు గురైన గ్రామాల్లోని ప్రజలకు జిల్లా యంత్రాంగం సేవలందిస్తోందని జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి చెప్పారు. వరదల కారణంగా రాకపోకలు స్తంభించిన గ్రామాల్లో విఆర్‌ఒలు, సచివాలయ సిబ్బంది, ఇతర మండలాల నుంచి కూడా సిబ్బందిని వరద ప్రభావిత గ్రామంలోనే నివాసం ఉంటూ 24 గంటలూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు. రుద్రమకోట గ్రామానికి మూడు రోజుల క్రితమే రోడ్డు రవాణా నిలిచిందని, ఆ గ్రామంలో మొత్తం 435 కుటుంబాల్లో, 50 కుటుంబాలు అశ్వారావుపేట బంధువుల ఇళ్లకు, 99 కుటుంబాలు రుద్రమకోట గ్రామంలోని కొండపైకి వెళ్లాయని, 286 కుటుంబాలు గ్రామంలోనే ఉంటున్నాయని తెలిపారు. అదే విధంగా కొండపైన జనరేటర్‌ను, తగినంత ఇంధనంతో గ్రామంలో మరొక జనరేటర్, మూడు నెలలకు సరిపడు నిత్యావసర వస్తువులను ముందస్తుగా వరద పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో పంపిణీ చేశామని, రుద్రమకోట గ్రామంలో వైద్య శిబిరాన్ని కూడా ఏర్పాటు చేశామని తెలిపారు. కొండ ప్రాంతాలతో పాటు గ్రామంలోని కుటుంబాలకు తగినంత మొత్తంలో తాగునీటిని సరఫరా చేశామన్నారు. వేలేరుపాడు మండలానికి చెందిన మొత్తం 34 ఆవాసాలు, ఏడు రోజుల నుండి రోడ్డు మార్గం తెగిపోవడంతో పూర్తిగా ముంపునకు గురయ్యాయన్నారు. రుద్రమకోట గ్రామానికి మూడు రోజుల నుంచి రోడ్డు రవాణా నిలిచిందని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా నిత్యావసర సరుకులు బియ్యం, పప్పు, కూరగాయలను అన్ని గ్రామాల్లో పంపిణీ చేశామని,, రుద్రమకోట గ్రామస్తులకు కూడా ఉచితంగా పంపిణీ చేశామని చెప్పారు. రోడ్డు మార్గం మూసుకుపోవడంతో 435 కుటుంబాలకు సరిపడు నిత్యావసర సరుకులు తీసుకెళ్లేందుకు బోటు సామర్థ్యంను బట్టి తీవ్రంగా నష్టపోయిన కుటుంబాలకు ప్రాధాన్యత ప్రాతిపదికన పంపిణీ చేస్తామని, ఇప్పటి వరకూ 217 కుటుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయగా 72 కుటుంబాలకు కూరగాయలు పంపిణీ చేశామని, మిగిలిన వారికి సోమవారం పంపిణీ పూర్తి చేస్తామన్నారు. సంబంధిత సర్పంచి సమక్షంలో విఆర్‌ఒ పంచాయతీ కార్యదర్శితో పాటు డిప్యూటీ తహశీల్దార్ పర్యవేక్షణలో నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ జరుగుతుందన్నారు. నూజివీడు సబ్‌కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ వేలేరుపాడు మండలంలో సహాయక చర్యలు పర్యవేక్షించేందుకు ప్రత్యేక అధికారిగా నియమించామని, రుద్రమకోట గ్రామాన్ని సబ్‌కలెక్టర్ ప్రత్యక్షంగా సందర్శించి సహాయక చర్యలు పర్యవేక్షించారని జెసి తెలిపారు.

మణిపూర్‌లో అరాచకాలకు నిరసనగా శాంతి ర్యాలీలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

మణిపూర్‌లో మారణ హోమానికి నిరసనగా ముదినేపల్లిలో పాస్టర్లు సోమవారం శాంతిర్యాలీ నిర్వహించారు. మండల పాస్టర్స్, దళిత సంఘాల ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకూ పాస్టర్లు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా పలువురు పాస్టర్లు మాట్లాడుతూ క్రైస్తవులపై జరిగే దాడులను తిప్పి కొట్టేందుకు పాస్టర్లు ఐక్యంగా ఉండాలన్నారు. రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు శేవా నాగజగన్‌బాబూరావు మాట్లాడుతూ మణిపూర్‌లో క్రైస్తవులను దారుణంగా చంపడం, ఆడపిల్లలను నగ్నంగా ఊరేగించడం, అత్యాచారాలు చేయడం, చర్చిలను తగలపెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోర రాష్ట్ర నాయకులు ఏసుపోగు దానియేలు, పాస్టర్లు సుధాకర్, క్రైస్తవులు పాల్గొన్నారు.

నూజివీడు రూరల్ : మణిపూర్‌లో అరాచకాలపై క్రైస్తవ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. వైసిపి క్రిస్టియన్ మైనారిటీ అధ్యక్షులు పిల్లా చరణ్ మాట్లాడుతూ విచక్షణారహితంగా క్రైస్తవులపై జరుగుతున్న దాడులను సమైక్యంగా ఖండించాలన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిని అందించారు.

ఉంగుటూరు : మణిపూర్‌లో క్రైస్తవులపై మారణకాండకు సంఘీభావంగా ఆలిండియా క్రిష్టియన్ కమిటీ ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా క్రిష్టియన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు బిషప్ ఎం.డేవిడ్‌లివింగ్‌స్టన్, సిడబ్ల్యూసి మండల అధ్యక్షులు రెవ టి.కోర్నేలు, నాయకులు రెవ.ఎం.సాల్మన్, మండల ప్రెసిడెంట్ బిషప్ విజయకుమార్, రెవ.డి.రాజు, ఉంగుటూరు, నిడమర్రు, బీమడోలు మండలాల పాస్టర్లు, విశ్వాసకులు పాల్గొన్నారు.

అటవీ భూములకు రక్షణ కరువు : టిడిపి

టి.నరసాపురం: మండలంలోని అల్లంచర్ల, కొత్తగూడెంలోని అటవీ భూములను పరిరక్షించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు ధర్నా నిర్వహించారు. అల్లంచర్ల, కొత్తగూడెం భూములను కాపాడాలని, అక్రమంగా అడవి నరికేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, భూ తగాదాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని తహశీల్దార్ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శీలం వెంకటేశ్వరావు, జయవరపు శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ మండలంలోని అల్లంచర్ల, కొత్తగూడెంలోని సర్వే నెంబరు 226, 227 భూములను పరిరక్షించాలన్నారు. ఆక్రమణలో ఉన్న విత్తనశుద్ధి కేంద్రం భూముల ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. సర్వే నెంబరు 226లో 400 ఎకరాల్లో రెవెన్యూ రికార్డుల్లో స్థానికుల ఎవరిపేరూ లేదని 2017లో అప్పటి తహశీల్దార్ రిపోర్టు ఇచ్చారని తెలిపారు. అయితే కొందరు స్థానికులు ఆ భూములు ఆక్రమిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 231, 227 సర్వే నెంబర్‌లో కాసననేని చంద్రశేఖర్ ఆ భూములు తనవేనని హైకోర్టు ఆర్డర్ ఇచ్చిందని చెబుతూ విలువైన టేకు చెట్లు, వెదురు, జామాయిల్ చెట్లను అక్రమంగా నరికి విక్రయిస్తున్నాడని, ప్రశ్నించిన గ్రామస్తులను బెదిరిస్తున్నాడని అక్రమ కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం : కలెక్టర్

ప్రజాశక్తి - ఏలూరు

సీనియర్ సిటిజన్ల రక్షణ, సంక్షేమం కోసం కల్పించిన వసతులను తప్పనిసరిగా వర్తింపచేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, జెసి బి.లావణ్యవేణి, డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై.రామకృష్ణ, ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణ స్వీకరించారు. ప్రజల నుండి 306 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఉంగుటూరు మండలం నీలాద్రిపురానికి చెందిన గౌరీ మిస్సమ్మ(70) తనకున్న 24 సెంట్ల భూమిని తన కొడుకు దౌర్జన్యంగా పండించుకుంటూ తనకు బస్తాబియ్యం కూడా ఇవ్వడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ తగు చర్యలు తీసుకోవాలని వినతిపత్రం అందజేశారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ సీనియర్ సిటీజన్ యాక్ట్ కింద సంబంధిత వ్యక్తికి నోటీసు జారీ చేయాలని ఆర్‌డిఒను ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ప్రతిఅర్జీని అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో నాణ్యతతో పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు.

రోడ్డు వేయాల్సిందే..

అధికారులను నిలదీసిన వైఎస్ఆర్ కాలనీ మహిళలు - పట్టణంలో ర్యాలీ

ప్రజాశక్తి - చింతలపూడి



ఆందోళన చేస్తున్న మహిళలు

'108 అంబులెన్సు వెళ్లడానికి అవకాశం లేదు.. పిల్లలు పాఠశాలకు వెళ్లే మార్గం లేదు.. రోగులను మంచం మీద ఆసుపత్రికి తీసుకెళ్లాల్సిన దయనీయ పరిస్థితులు.. ఈ సమస్యకు తక్షణం పరిష్కారం చూపండి. రోడ్డు పనులు ప్రారంభించే వరకూ ఇక్కడ నుంచి కదిలేది లేదు' అంటూ చింతలపూడి నగరపంచాయతీ వైఎస్ఆర్ కాలనీవాసులు రోడ్డు దుస్థితిపై సోమవారం ధర్నా నిర్వహించారు. కాలనీ వద్ద నుంచి పాతబస్టాండ్ మీదుగా నగరపంచాయతీ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ధర్నా చేపట్టారు. అక్కడ నుండి ఎంపిడిఒ కార్యాలయం వద్దకు చేరుకుని స్పందన కార్యక్రమం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ వైఎస్ఆర్ కాలనీకి రోడ్డు వేయాలని పలుమార్లు ప్రజాప్రతినిధుల వద్దకు వెళితే అస్సలు ఆ కాలనీ ఎక్కడుందని అడిగిన సంఘటనలు కూడా ఉన్నాయన్నారు. తమ కాలనీకి కేవలం ఓట్ల కోసమే వస్తారని, ఆ తర్వాత ఊరు పేరు కూడా తెలియడం లేదని చెప్పడం అన్యాయమన్నారు. 16 సంవత్సరాలుగా రోడ్లు లేక నానాఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. అనంతరం స్పందన కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ రాంబాబుకు వినతిని ఇచ్చేందుకు వెళ్లారు. ఈ క్రమంలో ఆయన కాలనీవాసులతో దురుసుగా మాట్లాడటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'వినతిపత్రం ఇస్తే ఇవ్వండి లేకపోతే వెళ్లిపోండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేయడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. అనంతరం తహశీల్దార్ కృష్ణజ్యోతి కాలనీవాసులతో మాట్లాడారు. రోడ్డు అభివృద్ధికి కమిటీని ఏర్పాటు చేస్తామని, వారంరోజుల్లో కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

టి.నర్సాపురం: పర్యావరణ పరిరక్షణ బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని భవ్యా గోపయ్య సర్వేశ్వరా ఫౌండేషన్ కన్వీనర్ భవ్యా వేణు గోపాల్ అన్నారు. సర్వేశ భవ్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని రుద్రకోటరాజుగూడెంలో భవ్యా వేణుగోపాల్ అధ్యక్షతన మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఫౌండేషన్ ద్వారా మండలంలోని కృష్ణాపురం, ప్రకాష్‌నగర్, రుద్రకోటరాజు గూడెం, అల్లూరి సీతారామరాజు నగర్‌తో పాటు ఆయా గ్రామాల్లో మొక్కలు నాటామని తెలిపారు. రానున్న రోజుల్లో మరికొన్ని గ్రామాల్లో మొక్కలు నాటుతామని తెలిపారు.

ఇ-క్రాప్ నమోదు తప్పనిసరి

ముసునూరు: వ్యవసాయశాఖ ద్వారా అందించే వివిధ పథకాలు లేదా రాయితీలు రైతులకు అందుబాటులో ఉండాలంటే ప్రతిఒక్కరూ తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని మండల రెవిన్యూ తహశీల్దార్ దాసరి సుధ అన్నారు. సోమవారం మండల రెవిన్యూ కార్యాలయంలో ముసునూరు మండల వ్యవసాయాధికారి ఎస్.మధుమోహన్ ఆధ్వర్యంలో మండల, గ్రామ రెవిన్యూ అధికారులతో పాటు గ్రామ వ్యవసాయ సహాయాధికారులు, ఉద్యానవన వ్యవసాయ సహాయాధికారులతో ఈ క్రాప్ నమోదుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసరి సుధ మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామాల్లోని రైతులందరితో తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయించాలని, అదేవిధంగా ఈ క్రాప్ నమోదు చేయడం వల్ల కలిగే పలు ప్రయోజనాలు గూర్చి ఆయా సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాల వద్ద సమావేశాలు నిర్వహించాలని కోరారు. కౌలు చేసే ప్రతి రైతు కౌలు కార్డులు పొందాలని తెలిపారు.

ఆర్యన్ కంపెనీలను సందర్శించిన విద్యార్థులు

ఉంగుటూరు: నారాయణపురం శ్రీ అరవింద శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బిజినెస్ మొదటి సంవత్సరం విద్యార్థులు క్షేత్ర పర్యటన నిమిత్తం ఉంగుటూరులోని ఆర్యన్ పాలిమర్స్, ఆర్యన్ ఫిషరీస్ కంపెనీలను సోమవారం సందర్శించారు. పాలిమర్స్‌లో ఎక్స్‌పెన్షివ్ పాలీ స్టైరిన్ ఉపయోగించి థర్మకోల్ ఎలా తయారు చేస్తారు, ఎంత వేడి దగ్గర థర్మకోల్ ఫ్యాక్టరీ చేయటానికి వీలవుతుంది, మొదలైన విషయాలను ప్రత్యక్షంగా విద్యార్థులు తెలుసుకొని దానిపై ప్రాజెక్ట్ రిపోర్ట్‌ను తయారు చేశారు. బోటనీ విద్యార్థులు కంపెనీ వెనుక వున్న ఎర్రచందనం ప్లాంటేషన్ తోటలను సందర్శించి వాటి పెంపకం, తెగుళ్లు, సస్యరక్షణ మొదలైన అంశాలను అధ్యయనం చేశారు.

గొర్రెల యజమానికి నష్టపరిహారం ఇవ్వాలి

చాట్రాయి: వీధి కుక్కలను నియంత్రించాలని కోరుతూ స్పందన కార్యక్రమంలో చాట్రాయి తహశీల్దార్ విశ్వనాథరావుకి వినతిని అందజేశారు. కొన్ని రోజుల క్రితం చనుబండ గ్రామంలో పాకాల ఆవరణ లోపల వున్న కటికిన చెన్నారావుకు చెందిన గొర్రెలను వీధికుక్కలు దాడి చేసి, 13 గొర్రెలను చంపాయి. ఈ విషయం పత్రిక కథనాల ద్వారా చూసి స్పందించి, చాట్రాయి మండల వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు కొమ్ము వెంకటరావు వినతిని అందజేశారు. చనిపోయిన ప్రతి గొర్రెకు రూ.12 వేలు నష్ట పరిహారం ఇప్పించాలని, వీధి కుక్కలను నియంత్రించి రక్షణ కల్పించాలని కోరారు.

'టిడిపి బలోపేతానికి కృషి'

ఉంగుటూరు: నియోజకవర్గ టిడిపి ఎస్‌సి సెల్ కార్యకర్తల సమావేశం ఆదివారం నారాయణపురం సర్పంచి దిడ్ల అలకానంద శ్రీను ఇంటి వద్ద నిర్వహించారు. ఏలూరు ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షులు యార్ల సుజీవరావు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్థాయిలో టిడిపి బలోపేతానికి, దళితవాడల్లో పార్టీ బలోపేతానికి కార్యాచరణ రూపొందించడం జరిగింది.

సెయింట్ థెరిస్సా యాజమాన్యానికి వినతి

ఏలూరు అర్బన్: రామచంద్రరావుపేటలో ఉన్న సెయింట్ థెరిస్సా కాలేజ్ ఏర్పాటుకు కృషి చేసిన దాతలకు సరైన గౌరవం ఇవ్వాలని క్షత్రియ సేవా సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే నగరంలోని సెయింట్ థెరిస్సా యాజమాన్యంకు సోమవారం వినతిని అందించారు. ఈ సందర్భంగా పాలకొల్లుకు చెందిన మంతెన నరసింహారాజు, బుద్ధరాజు శివాజీలు మాట్లాడుతూ సెయింట్ థెరిస్సా జూనియర్ కాలేజి ఏర్పాటుకు కీర్తిశేషులు చింతలపాటి మూర్తి రాజు ఎంతగానో కృషి చేశారన్నారు. కానీ కాలక్రమేనా ఆ పేరు సిహెచ్ఎస్‌డిగా మారిందన్నారు. కావున తక్షణమే చింతలపాటి సత్యవతి దేవి సెయింట్ థెరిస్సా కాలేజ్‌గా మెయిన్ బోర్డ్ మార్చాలన్నారు. ఈ వినతిపై సెయింట్ థెరిస్సా ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ సానుకూలంగా స్పందించారు. ఈ వినతిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, విగ్రహ ఏర్పాటుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

చాట్రాయి: రైతులు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కలిగి ఉండాలని మండల వ్యవసాయ అధికారి డబి శివశంకర్ అన్నారు. సోమవారం చాట్రాయి మండల తహశీల్దార్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన కూరగాయల ప్రదర్శన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. సేంద్రీయ పద్ధతిలో పండించిన కూరగాయలు తినటం వల్ల ప్రజల ఆరోగ్యానికి ఎంత మేలు చేస్తుందో రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం తహశీల్దార్ సిహెచ్ విశ్వ నాథరావు మాట్లాడారు.

డెంగీపై అప్రమత్తత అవసరం

ఏలూరు టౌన్ : డెంగ్యూ జ్వరాలుపై విద్యార్థులు మంచి అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే డెంగ్యూ జ్వరాలును అరికట్టవచ్చని 38 వ డివిజన్ కార్పొరేటర్ తోట శివ సూచించారు. డెంగ్యూ నివారణ మాసోత్సవం ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈదర సుబ్బమ్మ దేవి ఉన్నత పాఠశాల విద్యార్థులకు డెంగ్యూ జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ శివ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, కావున విద్యార్థులు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రతలో భాగస్వామ్యము కావాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు.

నేరాలు – ఘోరాలు

చెరువులో స్నానానికి దిగి వ్యక్తి మృతి

ముదినేపల్లి: ఊరచెరువులో స్నానానికి దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన దుర్ఘటన మండలంలోని వి.రావిగుంట గ్రామంలో ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామస్తులు కథనం ప్రకారం గ్రామానికి చెందిన పెనుమాల శ్రీహరి (48) అనే వ్యక్తి ఆదివారం రాత్రి ఇంటికి సమీపంలో ఉన్న ఊరచెరువులో స్నానానికి వెళ్లాడు. స్నానానికి వెళ్లిన శ్రీహరి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి అంతా గాలించారు. అనుమానంతో రాత్రి చెరువులో వెతికినా శ్రీహరి ఆచూకీ కానరాలేదు. సోమవారం ఉదయం 7 గంటల సమయంలో గ్రామస్తులు మరోసారి చెరువులో దిగి గాలించగా, ఊరచెరువులోని ఊబిలో శ్రీహరి కూరుకుపోయి మృతి చెంది ఉండడం గమనించి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారైలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుడివాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు

నూజివీడు రూరల్: తుక్కులూరు గ్రామ శివారు ప్రధాన రహదారిపై ఆదివారం అర్ధరాత్రి రూరల్ ఎస్ఐ తలారి రామకృష్ణ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్‌ను నిర్వహించారు. దీనిలో భాగంగా మద్యం సేవించి వాహనాలను నడుపుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాన్ని నడిపినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పేకాట స్థావరాలపై దాడి

ఆగిరిపల్లి: ఉన్నతాధికారుల ఆదేశానుసారం మండల పరిధిలోని సీతారామపురం గ్రామ శివార్లలో జరుగుతున్న పేకాట శిబిరంపై దాడి చేసి ముగ్గురు పేకాట రాయుళ్లను అదుపులోనికి తీసుకొని, వారివద్ద నుంచి రూ.2,100లు నగదును, శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారివద్ద నుంచి రూ.1,210లు నగదును స్వాధీన పర్చుకొని వారిపై కేసు నమోదు చేయటం జరిగిందని ఎస్ఐ ఎన్.చంటిబాబు తెలిపారు.

నూజివీడు రూరల్: పోతిరెడ్డిపల్లి గ్రామంలో పేకాట ఆడుతున్న ఏడుగురు సోదరులను పోలీసులు సోమవారం అదుపులోనికి తీసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం పోతు రెడ్డి పల్లిలోని ఒక గృహంలో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారని విశ్వసనీయ సమాచారం మేరకు దాడి జరిపి ఏడుగురు జూదరులను అదుపులోనికి తీసుకున్నామని నూజివీడు రూరల్ పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ వారి వద్ద నుండి రూ.14,240 నగదును స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

సామాన్యులకు అందుబాటులో లేని 'మహాప్రస్థానం'

ప్రజాశక్తి – చింతలపూడి

పేదవారికి ఉపయోగకరంగా రూ.కోట్లు ఖర్చు చేసి మృతదేహాలను తరలించేందుకు తీసుకువచ్చిన మహాప్రస్థానం అంబులెన్సులు చింతలపూడిలో నిరుపయోగంగా ఉన్నాయి. ఉచితంగా సేవలు అందించే మహాప్రస్థానంను సామాన్య ప్రజలు ఉపయోగించుకోలేని పరిస్థితి నెలకొంది. దీంతో అంబులెన్స్ సేవలను ఉపయోగించుకోకుండా ప్రైయివేట్ అంబులెన్సులను ఆశ్రయిస్తున్నారు. మహాప్రస్థానం అంబులెన్సులో చింతలపూడి హాస్పిటల్ నుంచి బయటకు వెళ్లాల్సి వస్తే ముడుపులు లేనిదే వెళ్లలేని పరిస్థితని ఆరోపణలున్నాయి. మహాప్రస్థానం డ్రయివర్‌కి రూ.500, డీజిల్‌కి రూ.1,000 ఇవ్వకపోతే తీసుకెళ్లమని ఖరాకండిగా చెబుతున్నారని బాధితులు వాపోతున్నారు. పేద ప్రజలకు ఉపయోగపడుతుందని ప్రభుత్వం కోట్లు ఖర్చుపెట్టి మహాప్రస్థానం అందుబాటులోకి తీసుకువస్తే అది అమలు కావడం లేదు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే నిరుపేదలు రూ.15,00 ఖర్చు పెడితే గాని అంబులెన్సు సేవలు ఉపయోగించుకోలేక పోతున్నారు. ఉచితంగా సేవలు అందించాల్సిన అంబులెన్సులను అక్రమంగా డబ్బులు వసూలు చేస్తూ సామాన్యుకి అందని రీతిలో చేస్తున్నారు. ప్రైయివేటు అంబులెన్సులో మృతదేహం తరలించాలంటే రూ.15,00 ఖర్చు అవుతుంది. దానితో సమానంగా ప్రభుత్వ మహాప్రస్థానం అంబులెన్సులు కూడా అదే రీతిలో వసూలు చేయడంలో సామాన్యుని పరిస్థితి ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. డబ్బులు వసూలు చేస్తున్నారని గతంలో ప్రజలు అధికారులకు ఫిర్యాదు చేసినా, అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో మరలా అటువంటి పరిస్థితిలు పునరావృతం అవుతున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

దీనిపై దృష్టి పెడతాం..

డా.హసిఫ్ ఖాన్
ప్రభుత్వ ఆసుపత్రి సూపరిడెంట్, చింతలపూడి

మహాప్రస్థానం అంబులెన్సు ఉచిత సేవలు అందబాటులో ఉన్నాయి. గతంలో డబ్బులు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వాటిని సరిదిద్ది దీనిపై సీరియస్‌గా దృష్టి పెడతాం. ప్రజలకు సేవలు అందిస్తాం.

ముదినేపల్లి ఎస్ఐగా వెంకట్‌కుమార్

ముదినేపల్లి: ముదినేపల్లి ఎస్ఐగా దేశంశెట్టి వెంకట్‌కుమార్ సోమవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఏలూరు స్పెషల్ బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకట్‌కుమార్ బదిలీపై ముదినేపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఇప్పటి వరకూ ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ షణ్ముఖసాయి నుంచి ఆయన ఛార్జీ తీసుకున్నారు. ఎస్ఐ షణ్ముఖసాయికి ఉన్నతాధికారులు ఇంకా ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన వెంకట్‌కుమార్‌కు పోలీసులు, పలువురు ప్రముఖులు అభినందనలు తెలిపారు.

జాబ్‌మేళాను వినియోగించుకోండి

కైకలూరు: నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించి, ఉపాధిని చూపించే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న జాబ్ మేళాను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, శిక్షణ ఉపాధి శాఖ, డిఆర్‌డిఎ సిడాప్ ఆధ్వర్యంలో స్థానిక విజ్ఞాన్ విద్యా సంస్థల ఆవరణలో సోమవారం నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ ఫెయిర్ నిర్వహించారు. ప్రభుత్వం యువతలో నైపుణ్యాభివృద్ధిని పెంచేందుకు శిక్షణ ఏర్పాటు చేసి ఉపాధి అవకావాలు కల్పిస్తుంది. యువతీ యువకుల అర్హతలు, అభిరుచులను సనుసరించి, ఇంటర్వ్యూలలో పాల్గొని విజయాలు సాధించాలని కోరారు. 16 కంపెనీల నుంచి ప్రతినిధులు విచ్చేసి, వందలాది మందిని ఎంపిక చేసుకుని వారికి అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి తమ్మాజీ రావు సభకు అధ్యక్షత వహించగా, ఎంపిపి అడివి వెంకట కృష్ణ మోహన్, అధిక సంఖ్యలో యువత పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలిగా శోభారాణి

ఉంగుటూరు: చేబ్రోలు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా అడపా శోభారాణి ఎంపికైయ్యారు. ఆదివారం రాత్రి నారాయణపురం లయన్స్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ప్రమాణ స్వీకారం చేసారు. సమావేశానికి శీతాల సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఈపూరి సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలకు వివిధ అంశాల పట్ల అవగాహన కల్పించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాన్ని జిల్లా లయన్స్ నాయకులు కొత్తపల్లి రవికుమార్ అధ్వర్యంలో నిర్వచించారు. ఈ సమావేశంలో జోన్ ఛైర్మన్ సత్యనారాయణమూర్తి, కార్యదర్శి అడపా శోభారాణి, వంకిన ప్రతాప్, బుల్లెబ్బాయి, ఎస్.మాలతీ రాణి బొమ్మిడి అప్పారుపు, పుప్పాల గోపి, ఆకుల పాండు రంగ పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గం చేబ్రోలు లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షురాలిగా అడపా శోభారాణి, కార్యదర్శిగా ఆకుల పాండురంగారావు, కోశాధికారిగా నూకల రోహిత్ నాయుడు, ఉపాధ్యక్షులు గుణం బుల్లెబ్బాయి, రామిరెడ్డి, వెంకట రెడ్డి ఎన్నికైయ్యారు.

పిహెచ్‌డి పట్టాను అందజేస్తున్న ఎస్ఆర్‌ఐ

ప్రొఫెసర్ అర్పితకు పిహెచ్‌డి పట్టా

ఆగిరిపల్లి :మండల పరిధిలోని పోతవరప్పాడు ఎస్ఆర్ఐ కళాశాలలో ఇసిఇ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న యలమంచిలి అర్పితకు జెఎన్‌టియుకె కాకినాడ వారు పిహెచ్‌డి డిగ్రీని ప్రధానం చేశారు. పిహెచ్‌డి డిగ్రీని కళాశాల ఛైర్మన్ రావి వెంకట్రావు ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఎన్‌ఎఫిషియంట్ విఎల్‌యస్ఐ ఆర్కిటేచర్ ఫర్ కార్డియో వాస్కులార్ మోనిటరింగ్ సిస్టమ్ అను అంశంపై పరిశోధన చేసినందుకు గానూ అర్పితకు పిహెచ్‌డిని ప్రధానం చేసినట్లుగా పెర్కోన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి.నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావులు అర్పితను అభినందించారు.

వికలాంగులకు మూడు చక్రాల వాహనాలు అందజేత

ప్రజాశక్తి – భీమడోలు

దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం అందజేస్తున్న సహాయ సహకారాలు సద్వినియోగ పరుచుకోవాలని గుండుగొలను గ్రామపంచాయతీ ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణ రాజు కోరారు. ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసు బాబు చొరవతో భీమడోలు మండలానికి చెందిన ముగ్గురు దివ్యాంగులకు ఒక్కొక్కటి రూ.లక్ష విలువైన ట్రై మోటార్ వాహనాలు మూడు మంజూరైయ్యాయి. దీనిలో భాగంగా గుండుగొలను గ్రామపంచాయతీ పరిధిలోని భోగాపురం ఆవాస ప్రాంతానికి చెందిన కంటా భాగ్యరాజుకు మంజూరైన ట్రై మోటార్ సైకిల్‌ను గుండుగొలను పంచాయతీ కార్యాలయం వద్ద సోమవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచితో పాటు గ్రామపంచాయతీ కార్యదర్శి జివి కృష్ణ మోహన్ రావు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ ఉపసర్పంచి లబ్ధిదారున్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల సమన్వయకర్త గుటికల మురళి పాల్గొన్నారు.

దివ్యాంగులకు మోటర్ సైకిల్ అందజేస్తున్న ఉపసర్పంచి

కళ్ల కలకలపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి – ఏలూరు

కళ్లకలక(కాంజక్టివైటీస్) వస్తే వారంపాటు ఇబ్బంది పెట్టినా తర్వాత తగ్గిపోతుందని ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగ అధిపతి డా.మల్లికార్జునరావుతో కలిసి కళ్లకలక లక్షణాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై డా. నాగేశ్వరరావు ప్రజలకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డా.నాగేశ్వరరావు మాట్లాడుతూ వర్షాకాల సీజన్, వాతావరణ మార్పుల సమయంలో ఈ కంటి కలక వ్యాధి ఎక్కువగా వ్యాప్తి చెందుతుందని, ఇంట్లోనే సాధారణ నివారణా చర్యలు పాటిస్తూ ఈ వ్యాధిని తగ్గించుకోవచ్చన్నారు. దీనికి భయపడి కంగారుపడాల్సిన అవసరం లేదన్నారు. కళ్లు ఎరుపుగా మారడం, దురద, నీటితో నిండిన కళ్లు, కళ్లు మంటగా ఉండడం, గరగర లాడడం ఈ వ్యాధి లక్షణాలన్నారు. ఈ వైరస్ ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందన్నారు. ఎక్కువగా చేతులను శుభ్రంగా ఉంచుకోవాలని, కంటిని తరచుగా మంచినీటితో శుభ్రం చేసుకోవాలని తెలిపారు. కళ్లకలక వచ్చిన వారికి దూరంగా ఉండాలన్నారు. ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి కంటి విభాగ అధిపతి డా.మల్లికార్జునరావు మాట్లాడుతూ కళ్ల కలక వచ్చిన తరువాత 3 నుంచి 5 రోజులలోగా వ్యాధి తీవ్రత తగ్గిపోతుందని, 7 నుంచి 14 రోజులలోపు వైరస్ ప్రభావం ఉంటుందన్నారు. కొంతమందికి మందులు వాడకపోయిన వారంలో తగ్గిపోతుందన్నారు. బయటకు వచ్చే సమయంలో నల్ల కళ్లజోడు పెట్టుకోవడం మంచిదన్నారు. ప్రయివేటు ఆర్‌ఎంపిలు, మెడికల్ షాపుల వారిని సంప్రదించి మందులు వాడవద్దని ఆయన తెలిపారు. కేవలం కంటి వైద్యులను సంప్రదించి వారి సూచనలు మేరకు మందులు వాడాలన్నారు. నవజాత శిశువులు, నెలలోపు వయస్సు కలిగిన చిన్న పిల్లలకు కళ్ల కలక వస్తే మాత్రం ప్రమాదకరంగా మారుతుందని, కంటి గుడ్డు, కార్నియాకు విస్తరించి చూపు మందగించే ప్రమాదముందన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో కళ్ల కలక నివారణకు మందులు ఉచితమన్నారు. ఆందోళ పడాల్సిన అవసరం లేదన్నారు.

మొండి వాగు కాలువను బాగు చేయాలి

ప్రజాశక్తి – పెదపాడు

భారీ వర్షాలకు పంటలు ముంపుకు గురికాకుండా మురుగు కిందకు వెళ్లేలా కొత్త ముప్పురు శివారు వీరభద్రపురం మొండి వాగు కాలువను వెంటనే బాగు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మొండి వాగు కాలువను బాగు చేయాలని, పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ పెదపాడు శివారు వీరభద్రపురం మొండి వాగు కాలవ కింద సుమారు 250 ఎకరాలు వరి పంట సాగు అవుతుందని తెలిపారు. ఈ కాలువ గుర్రపు డెక్క, కిక్కస, తూడు, జమ్ముతో పూడిపోయి మురుగు క్రిందకు వెళ్లక పంటలు ముంపుకు గుర్రై రైతులు, కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు 70 ఎకరాలు పైగా పంట మునిగి రైతులు నష్టపోయారని తెలిపారు. మండలంలో భారీ వర్షాలు కురిసిన చోట పంట నష్టాలను నమోదు చేసి ఎకరాకు రూ.15 వేలు నష్ట పరిహారం ఇవ్వాలని కోరారు. పంటలు నష్టపోయిన కౌలు రైతులు, పేదరైతులను ఆదుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం స్పందన కార్యక్రమంలో సమస్యలతో కూడిన వినతిని మండల తహశీల్దార్ విజయ కుమార్ రాజు, ఎంపిడిఒ నిర్మలా జ్యోతి, మండల వ్యవసాయ అధికారి ప్రదీప్‌లకు రైతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డోకల సూర్య ప్రభాకర రావు, డోకల వెంకట్రావు, డోకల చలపతిరావు, గులిపల్లి రామ్మోహన రావు, టి.గీతా కుమారి పాల్గొన్నారు.

మురుగు తొలగింపు చర్యలు ముమ్మరం

భీమడోలు: వానల కారణంగా ముంపుకు గురైన పొలాల నుంచి వరద నీటిని తీసే కార్యక్రమాన్ని అధికారులు ముమ్మరం చేశారు. లక్ష్మీపురం గ్రామము వద్ద గల బెబ్బులికోడు పూడుకుపోయిన కారణంగా గుండుగొలను రెవిన్యూ పరిధిలోని వందలాది ఎకరాల విస్తీర్ణంలోని వ్యవసాయ క్షేత్రాలు ముంపుకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఈ విషయం జిల్లా కలెక్టర్ దృష్టికి రావడంతో సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని జిల్లాకు చెందిన పలువురు ఉన్నత స్థాయి అధికారులకు ఆయన ఆదేశాలు జారీ చేశారు. దీనిపై స్పందించిన అధికారులు హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. వివిధ శాఖల మధ్య సమన్వయం లోపించడంతో కోడును, పూడిక తీసే పనుల బాధ్యతను సాంకేతిక కారణాల సాకుతో తీసుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దీనితో రెవిన్యూ, పంచాయతీరాజ్ అధికారులు రంగంలోనికి దిగి రైతులతో చర్చించారు. పూడికతీతను చేపట్టేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. భీమడోలు వ్యవసాయ అధికారి మాట్లాడుతూ పూడిక తీత కార్యక్రమం ప్రారంభమైన తర్వాత పొలాల్లోని ముంపు క్రమక్రమంగా తగ్గటం ప్రారంభమైందన్నారు. సుమారు 150 ఎకరాల్లో నాట్లు వేసిన వరి మొనలు పైకి తేరటం వల్ల నష్ట శాతం తక్కువగా ఉండే అవకాశం ఉందన్నారు. దీనిని కాపాడుకునేందుకు రైతులు యూరియా, పొటాష్‌తో పాటు సాఫ్ మిశ్రమాన్ని వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనల మేరకు వాడాలని కోరారు. కోడు, పూడికతీత కార్యక్రమాల్ని భీమడోలు వ్యవసాయ అధికారులతో పాటు డిప్యూటీ తహశీల్దార్ షంషుద్దీన్ పరిశీలించారు.

ప్రయాణికుల సౌకర్యార్థం సోలార్ దీపాలు

భీమడోలు : జాతీయ రహదారి నుంచి భీమడోలు గ్రామంలోకి కోమటిగుంట మీదుగా ప్రయాణించే వాహనదారుల సౌకర్యార్థం స్థానిక సత్యసాయి సేవా సమితి చేపట్టిన కార్యక్రమాన్ని పలువురు అభినందిస్తున్నారు. వివరాల్లోకి వెళితే జాతీయ రహదారిపై గల సూరప్ప గూడెం విద్యుత్ ఉప కేంద్రం వద్ద కోమటికుంట మీదుగా గ్రామంలో ప్రవేశించే దగ్గర మార్గం ఉంది. పంచాయతీరాజ్ అధికారులు ఈ మార్గాన్ని అధునీకరించారు. కానీ ఆ ప్రాంతమంతా రాత్రి సమయంలో చీకటిమయం కావడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. దీనిని గుర్తించిన సత్య సాయి సేవా సమితి వారు అ మార్గం మొదట్లో వెలుగు చూపేందుకు సెన్సా ర్ విధానంతో పనిచేసే సోలార్ దీపాలను వేలాది రూపాయల వ్యయంతో ఏర్పాటు చేశారు. ఇదే క్రమంలో దూరం నుంచి సైతం ఆ మార్గం ఉన్నట్టుగా తెలియజేసే రేడి యం సూచిక ను సోలార్ దీపం అమర్చిన స్తంభానికి ఏర్పాటు చేయటం వల్ల వాహనదారులకు మార్గం గుర్తించడం తేలికయ్యింది.

వ్యక్తిగత కుళాయిలతో సొమ్ము చేసుకుంటూ..!

ప్రజాశక్తి – మండవల్లి

పంచాయతీ వ్యక్తిగత కుళాయిలు సర్పంచి, కార్యదర్శి ఆర్థిక వనరులుగా మారాయి. గుట్టు చప్పుడు కాకుండా, అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా వ్యక్తిగత కులాయి కనెక్షన్ ఇచ్చేస్తూ లక్షల సొమ్ము చేసుకుంటున్నారని విమర్శలు ఉన్నాయి. దీంతో పూర్తిస్థాయిలో త్రాగునీరు అందక గ్రామస్తులు నానా అవస్థలు పడుతున్నారు. దీనికి నిదర్శనమే అనుమతులు లేకుండా స్టేషన్ రోడ్‌లో ఇస్తున్న పంచాయతీ కులాయి కనెక్షన్. గ్రామస్తుల కథనం ప్రకారం మండల కేంద్రమైన మండవల్లిలోని గ్రామస్తుల దాహార్తిని తీర్చే విధంగా ప్రధాన సెంటర్లో 90 వేల సామర్థ్యం కలిగిన మంచినీటి పథకము, స్టేషన్ రోడ్డులో కొండరాయి చెరువు వద్ద 40 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మరో మంచినీటి పథకము ఉన్నాయి. ఈ పథకాల ద్వారా వచ్చే నీటితోనే గ్రామస్తులు దాహార్తిని తీర్చుకోవాల్సి ఉంది. అయితే ఇప్పటి వరకూ రెండు పథకాలపై సుమారుగా 1100 వ్యక్తిగత కుళాయిలు ఉన్నాయి. అయితే గ్రామంలో నివాసాలు పెరగడంతో పాటు మండవల్లి మీదుగా ఉన్న జాతీయ రహదారి అభివృద్ధికి నోచుకోవడంతో, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మండవల్లి ప్రాంతంలో స్థలాలను కొనుగోలు చేసుకుని నివాసాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. చుట్టుప్రక్కల ఆక్వా చెరువులు వల్ల ఉప్పు శాతం పెరిగినప్పటికీ మంచినీటి చెరువులోని నీరు కలుసితం కాకపోవడంతో మండవల్లిలో పంచాయతీ కుళాయిలకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. ఇదే అదునుగా చూసుకున్న పంచాయతీ అధికారులు, పాలకులు గుట్టు చప్పుడు కాకుండా కుళాయి కనెక్షన్ ఇచ్చేస్తూ రూ.50 వేల నుంచి 2 లక్షల వరకూ వసూలు చేసి జేబులు నింపుకుంటున్నట్లు సమాచారం. వందకు పైనే అనుమతులు లేకుండా వ్యక్తిగత కుళాయిలు ఉన్నట్లు సమాచారం. వ్యక్తిగత కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని గ్రామస్తులు గ్రామసభల్లో కోరడంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌సి ఆర్‌డబ్ల్యూఎస్ డిఇ నుంచి సాంకేతిక సలహా తీసుకోవడం కోసం పంచాయతీ తీర్మానం చేసింది, అయినప్పటికీ నేటి వరకూ అది అమలు కాలేదంటే గ్రామస్తులకు వ్యక్తిగత కుళా యిలు ఇవ్వడంలో అధికారులు, పాలకులు తీరు ఏవిధంగా ఉందనేది తేటతెల్లమవుతుందని వారు వివరిస్తున్నారు .

ప్రధాన సెంటర్లో ఉన్న 90 వేల లీటర్ సామర్థ్యం కలిగిన మంచినీటి పథకం ద్వారా ఏడు లైన్లుగా విడదీసి రోజుకి 7 దఫాలుగా కుళాయిల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. హరిజనవాడ పల్లపు బజారు రైల్వే గేటు, కైకలూరు సందు, పాత శివాలయం రోడ్డు జాతీయ రహదారి వెంబడి ఉన్న కుళాయిలకు రోజుకి గంట సమయమే నీటిని సరఫరా చేస్తున్నారు. అయితే స్టేషన్ రోడ్డు దూరం కావడంతో మూడు నుంచి ఐదు గంటల సేపు తాగునీటిని విడుదల చేస్తున్నారు. స్టేషన్ రోడ్డు ప్రాంతంలో మొగలాయి చెరువు పథకం ఉన్నప్పటికీ ఒకే నివాసంలో రెండు పథకాలకు చెందిన పంపులు ఉండడంతో రెండు పథకాల ద్వారా నీరు చేరుతున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ప్రధాన మొగలాయి చెరువు పథకంపై, ఫిల్టర్ బెడ్‌లపై, మోటార్లపై మరింత భారం పెరిగి నిత్యం మరమ త్తులకు నోచుకుంటున్నాయి. దీంతో రూ.లక్షలు ప్రజాధనం దుర్వినియోగం అవుతుందని ప్రజలు తెలుపుతున్నారు.

నేటికీ అందుబాటులోకి రాని కొండ రాయి

మండవల్లిలోని ప్రజలకు పూర్తిస్థాయిలో నిరందించే విధంగా స్టేషన్‌రోడ్‌లో, కొండ రాయచూరు ప్రాంతంలో సుజాత కమిటీ ఏర్పాటు చేసి రూ.40 వేల లీటర సామర్థ్యం కలిగిన పథకాన్ని 2008లో అట్టహాసంగా నిర్మించి ప్రారంభించారు. అప్పటి నుంచి నీరు తెల్లగా లేవని, పసర్లుగా ఉన్నాయని, పశువులు చెరువులో దిగుతున్నాయని అనేక కారణాలను చూపిస్తూ స్టేషన్ రోడ్డు ప్రజలు ఆ నీటిని తాగేందుకు నిరాకరించారు. అయితే ఆ చెరువును ప్రజలకు అందుబాటులోకి తెచ్చే విధంగా రూ.లక్షలు వెచ్చించి చెరువులో అనేక కార్యక్రమాలు చేపట్టినా నేటికీ స్టేషన్ రోడ్డు ప్రజల దాహార్తిని తీర్చలేకపోతుంది. ఆ పథకం ద్వారా వచ్చే నీటిని కేవలం ఉదయం పూట రెండు గంటలు మాత్రమే సరఫరా చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. రెండు పథకాలు ఉన్నప్పటికీ మండవల్లి గ్రామస్తులకు మాత్రం పూర్తిస్థాయిలో తాగునీరు అందించలేకపోతున్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండానే పంచాయతీ కుళాయిలు కనెక్షన్ ఇచ్చేస్తూ, మరో పక్క గ్రామంలో వ్యక్తిగత కుళాయిలను ఇచ్చే విధంగా ప్రజా సేకరణ పేరుతో గ్రామ సభ నిర్వహించడం పలు విమర్శలకు తావిస్తోంది. ఇది ఇలా ఉంటే జలజీవన్ మిషన్ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఇంటికి ఉచితంగా కులాయి ఇవ్వాలనే లక్ష్యంతో గత సంవత్సరంలోనే రూ.69 లక్షల నిధులను మంజూరు చేసినప్పటికీ, అమలు చేసే విధంగా పాలకులు, అధికారులు చర్యలు చేపట్టకపోగా, వ్యక్తిగత కుళాయిలు ఇచ్చే విధంగా వేలకు వేలు డిపాజిట్లు కట్టించుకొంటున్నారు. అనాధికారంగా మరికొంత సొమ్మును వసూలు చేస్తూ పేద ప్రజలపై ఆర్థికంగా పెను భారం మోపే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. పంచాయతీ కుళాయిలపై నెలకొన్న సమస్యను గ్రామ సభలో ఏవిధంగా నిర్ణయించి పరిష్కరిస్తారు అనేది తెలియాలంటే వేచి చూడాల్సిందే. దీనిపై పంచాయతీ కార్యద ర్శులు టి.శ్రీనివాసరావుని వివరన కోరగా మంగళవారం వ్యక్తిగత కుళాయిల విషయంపై గ్రామసభ నిర్వహిస్తున్నామని అన్నారు. స్టేషన్ రోడ్‌లో వ్యక్తిగత కుళాయి కనెక్షన్ ఇచ్చినట్లు తనకు తెలియదన్నారు. ఎవరు ఇచ్చారు, ఎందుకు ఇచ్చారు, వివరాలు తెలుసుకుంటానని తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల ఆందోళన

నూజివీడు రూరల్: పట్టణంలోని చిన్న గాంధీ బొమ్మ సెంటర్లో విద్యుత్ ఉద్యోగుల ఐక్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేపట్టారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాక ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు మాట్లాడుతూ పే రివిజన్, పిఆర్‌సి అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించలేని పక్షంలో ఆందోళన మరింత ఉదృతం చేస్తామని తెలిపారు.

ఇ-పంట నమోదుపై అవగాహన

బుట్టాయగూడెం: మండల తహశీల్దారు కార్యాలయంలో ఈ పంటపై అవగాహన సదస్సు నిర్వహించారు. 2023 ఖరీఫ్ ఈ పంటలో కొత్తగా భూమి యొక్క జియో కోఆర్డినేట్స్‌ను ఈ పంట పోర్టల్ నందు పొందు పరచడమైనది. దీని ద్వారా ఈ పంట మరింత మెరుగ్గా నమోదు చేయబడుతుందని, గ్రామ చిత్రపటంలో చూపిన విధంగా పొలాలను సందర్శించి కౌలు రైతులు, పట్టాదారు రైతుల యొక్క పంట నమోదు అనేది నమోదు చేయడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

'స్పందన'కు 16 అర్జీలు

నూజివీడు రూరల్: పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజలు 16 అర్జీలను అందజేసినట్లు కార్యాలయ పరిపాలనాధికారి తేజోమని తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పరిష్కరించలేని పక్షంలో ఎందుకు పరిష్కారం కావో వాటి వివరాలను తెలపాలని ఆవిడ ఆదేశించారు.

రెండో పిహెచ్‌సి ఏర్పాటుకు కృషి

మండవల్లి: రోగులకు అందుబాటులో ఉండే విధంగా రెండవ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఏలూరు జిల్లా ఆర్‌డిఒ పి.కిషోర్ తెలిపారు. పిహెచ్‌సి ఏర్పాటుకు చావలపాడులో ఉన్న స్థలాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండవల్లి మండలానికి రెండవ ప్రాథమిక కేంద్రం ఏర్పాటుకు అనుమతులు వచ్చాయని అన్నారు. చావలపాడులో నిర్మించాలా లేక చింతపండులో నిర్మించాలనేది నిర్ణయించాల్సి ఉందని తెలిపారు. మెరక చేయడానికి రూ.80 లక్షలు ఖర్చు అవుతుందని తెలిపారు.

ప్రొసీడింగ్ ఆర్డర్స్ అందజేత

ఏలూరు టౌన్: నగరపాలక సంస్థకు ఆదాయం చేకూర్చే చర్యల్లో భాగంగా నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీగా ఉన్న పలు షాపులను వేలంపాట నిర్వహించి, నగరపాలక సంస్థకు ఆదాయం చేకూరే విధంగా చర్యలు చేపడుతున్నామని నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. కొన్ని సంవత్సరాలుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించి అధికారులు నిర్వహించిన వేలంపాట ద్వారా షాపులు దక్కించుకున్న 20 మందికి మాజీ ఎంఎల్ఎ ఆళ్ల నాని ఆదేశాల మేరకు సోమవారం నగరపాలకసంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్‌లో ప్రొసీడింగ్ ఆర్డర్స్‌ను అందించారు. ఈ సందర్భంగా మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు మాట్లాడుతూ ఒక్కొక్క షాపు 25 సంవత్సరాలకు లీజు చొప్పున నెలకి సుమారుగా రూ.3 వేలు అద్దెగా నిర్ణయించినట్లు తెలిపారు.

కూలిన కల్వర్టు వంతెన

నూజివీడు రూరల్: మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామ శివారులో ప్రధాన రహదారిపై ఉన్న కల్వర్టు వంతెన సోమవారం కుప్ప కూలిపోయింది. నూజివీడు నుంచి ముసునూరు మీదుగా జిల్లా కేంద్రమైన ఏలూరు నగరానికి ఇదే రహదారిపై నిత్యం వందలాది వాహనాలు ఆర్‌టిసి బస్సు రాకపోకలు సాగిస్తూ ఉంటాయి. ఈ రహదారిలో ద్విచక్ర వాహనాలను మాత్రమే అనుమతిస్తున్నామన్నారు. ఎప్పటికైనా అధికారులు పటిష్టమైన వంతెన నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆర్‌బికెల సిబ్బందికి శిక్షణ

నూజివీడు రూరల్: రైతు భరోసా కేంద్రాల సిబ్బందికి సోమవారం పట్టణంలోని ఎడిఎ కార్యాలయం ఆవరణలో ఈ క్రాప్ బుకింగ్‌పై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ విద్యాసాగర్ మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలను తప్పనిసరిగా ఈ క్రాప్ బుకింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వం రైతాంగానికి అందించే పథకాలు ఈ క్రాప్ బుకింగ్ చేస్తేనే అందుతాయని తెలిపారు.

CHANGE OF NAME

We, **JOHANNAS PREMKUMAR MALLIPUDI AND SHANTHI JOHANNAS MALLIPUDI PARENTS of MARY JIANA MALLIPUDI** resident of 29-111, Near S.A.L.T. Church, Velpur Road, TANUKU 534 211 have changed her name from **MARY JIANA MALLIPUDI (old name) to MARIE JIANA MALLIPUDI (new name).** Hence, after all her documents (Passport, Aadhar, etc.,) and all correspondence will continue with her New Name **MARIE JIANA MALLIPUDI.**

ప్రకటన
మహారాజశ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఒ.యస్.నెం.246/2015

బిట్వీన్
ద్రోణంరాజు సదాశివరావు ...వాది
మరియు
పరసా కమల, వైఫ్ ఆఫ్ నారాయణరావు, హిందువు, వయస్సు 59 సం॥లు, గృహిణి, జంగారెడ్డిగూడెం పోస్ట్ అండ్ మండలం, ప్రస్తుతం ఏలూరు జిల్లా, వగైరాలు ...ప్రతివాదులు

పై నెంబరు దావాలో వాది, పరసా నారాయణరావు మొదటి తరగతి వారసులపై దావా దాఖలు చేయగా 1వ ప్రతివాదికి శ్రీ కోర్టువారి ద్వారా పంపిన దావా సమన్లు అమలు జరగటంలేదు. అందువల్ల 1వ ప్రతివాది హాజరు కొరకు పబ్లికేషన్ ఆర్డరు శ్రీ కోర్టు వారు దయచేయించియున్నారు. కావున ఈ ప్రకటన ద్వారా పరసా కమల వైఫ్ ఆఫ్ నారాయణరావు, జంగారెడ్డిగూడెం పోస్ట్ అండ్ మండలం, ప్రస్తుతం ఏలూరు జిల్లా వారు ది.04-08-2023వ తేదీన ఉదయం 10-30 గంటలకు స్వయముగా గానీ, ప్లీడరు గారి ద్వారా గానీ పై కోర్టు వారి యెదుట హాజరై వారి ఆక్షేపణలు తెలియ జేయగలరని, లేనిచో వారి పరోక్షములో దావా తీర్మానించబడునని తెలియజేయడమైనది.

తిరువూరు,
ది.31-07-2023
ఇట్లు
ఆర్.మోహనరెడ్డి,
వాది తరపు న్యాయవాది, తిరువూరు.